## క్లుప్తంగా

### 28న మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండల సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 28వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ, కో ఆప్షన్‌సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సంబంధిత శాఖల వివరాలతో హాజరుకావాలని కోరారు.

### ఎరువుల పంపిణీ ప్రారంభం


పంపిణీలో మాట్లాడుతున్న ఏఓ మాల్యాద్రి

కొండపి: మండలంలోని చోడవరం సొసైటీలో ఎరువుల పంపిణీని వ్యవసాయాధికారి మాల్యాద్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం సొసైటీ పరిధిలో డీఏపి 12 మెట్రిక్ టన్నులు, యూరియా ఆరు మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. సొసైటీ పరిధిలోని గ్రామాల్లోని చోడవరం, ముప్పవరం, మిట్టపాలెం, గోగినేనివారిపాలెం, చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు, కట్టుబడిపాలెం, కె.ఉప్పలపాడు గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు బొద్దులూరి లక్ష్మీ ప్రసన్న, నారాయణ వెంకటేశ్వర్లు సీఈఓ నాగార్జున,వ్యవసాయ శాఖ సిబ్బంది,ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

టంగుటూరు: రైతుకు బోర్డు అనుమతించిన మేరకే పొగాకు సాగు చేయాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. టంగుటూరు పొగాకు బోర్డు ఆవరణలో వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు మార్కెట్ దృష్ట్యా 142 మిలియన్ కేజీల ఉత్పత్తికి మాత్రమే అనుమతి ఉందన్నారు. రైతులు అధిక ధరలకు భూములు, బ్యార్నీలు కౌలుకు తీసుకొని నష్టపోవద్దని సూచించారు. క్షేత్రాధికారి జి.ఉపేంద్ర, ఐటీసీ, జీపీఐ, పోలిశెట్టి, బొమ్మిడాల, అలయన్స్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

### కనిగిరిలో సీపీఐ జెండా ఆవిష్కరణ


కనిగిరిలో సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

కనిగిరి రూరల్: సీపీఐ జాతీయ మహాసభలను పురస్కరించుకొని కనిగిరిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసిన్, పందిటి మోహన్, సయ్యద్ షాహిద్, బాలిరెడ్డి, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

### కాశీనాయన ఆలయంలో ప్రత్యేక ఆరాధన



హనుమంతునిపాడు: మండలంలోని సీతారాంపురంలో వెలసిన కాశీనాయక ఆలయంలో గురువారం ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

### రణభేరికి తరలిన నేతలు


రణభేరికి వెళుతున్న ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): డిమాండ్ల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన రణభేరి కార్యక్రమానికి సీఎస్ పురం యూటీఎఫ్ మండలశాఖ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈసందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి బి.సాంబశివరావు, మండల ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషా మాట్లాడుతూ పీఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని, ఆర్థికబకాయిలు చెల్లించాలన్నారు. ఎన్.తిరుపతయ్య, జి.వెంటేశ్వర్లు, బివిఎస్ రమేష్, డి.ఉదయ్ పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

# సజ్జ రైతుకు దిగుబడి దిగాలు..!


మర్రిపూడిలో సాగుచేసిన సజ్జ పంట


తాలు విత్తనాలు ఉన్న సజ్జ కంకులు.

- వరుస వర్షాలతో పంటను ఆశించిన పచ్చపురుగు
- 500 హెక్టార్లలో కన్నుమూసుకుపోయిన సజ్జ పంట
- ఎకరాకు 5 బస్తాల దిగుబడి కూడా రాదంటున్న రైతులు

మర్రిపూడి: ఈ ఏడాది రైతులకు ఏ పంట కలిసి రావడం లేదు. ఇప్పటికే కంది, మిరప, శనగ పంటల్లో దిగుబడి, ధరలు లేక నష్టాల మూటగట్టుకున్నారు. ఇప్పుడు సజ్జ సాగు చేసిన రైతుల వంతైంది. కంది, మిరప, శనగ పంటల్లో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు సజ్జ సాగుపై ఆశలు పెట్టుకున్నారు. మండలంలో జూలైలో సజ్జ సాగు చేపట్టారు. అయితే సాగు ప్రారంభంలో ఎండలు విపరీతంగా కాశాయి. ఆ తర్వాత వర్షాలు కురవడంతో పంట ఏపుగా పెరిగింది. దీంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశపట్టారు. అయితే వారి ఆశలపై నీళ్ల చల్లుతూ సజ్జ కంకి సుంకు మీద ఉన్న సమయంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత వారం రోజులుగా విరామం లేకుండా అడపా దడపా వర్షాలుకురుస్తుండటంతో పంట కన్ను మూసుకుపోయింది. దీంతో పంట పచ్చపురుగు ఆశించడంతో రైతుల ఆశలపై నీళ్ల చల్లినట్లయింది.

**పెరిగిన పెట్టుబడి..**

మండలంలోని దాదాపు 1500 ఎకరాలల్లో సజ్జ సాగు చేశారు. పన్నూరు, మర్రిపూడి, కూచిపూడి, జువ్విగుంట, గుండ్లసముద్రం, వల్లాయపాలెం, చిలంకూరు, వేమవరం, ధర్మవరం, గార్లపేట తదితర గ్రామాల్లో అత్యధికంగా సజ్జ సాగు చేశారు. విత్తనాలు, బలంమందు, సేద్యాలు, కలుపుతీత, కూలీ తదితర పనులకు ఎకరాలకు సుమారు రూ. 19వేలు ఖర్చయింది. కౌలు రైతులకు కౌలు అదనం. అయితే గత ఏడాది, ఎకరాలకు 15 నుండి 20 బస్తాలు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఎకరాలకు 5 బస్తాలు కూడా దిగుబడి వస్తుందో, రాదో అర్థం కావడంలేదని రైతులు ఆందోళనచెందుతున్నారు.

**రైతుల ఆశలపై పచ్చపురుగు దెబ్బ..**

అధిక వర్షం కారణంగా సజ్జపంటకు పచ్చ పురుగు ఆశించి పైరును నాశనం చేసింది. పైరు సుంకు మీద ఉన్న సమయంలో వర్షం కురవడంతో సుంకు రాలిపోయింది. విత్తనాలు గట్టిపడకుండా తాలుగింజ వచ్చింది. పురుగు, అధిక వర్షం కారణంగా ఈ ఏడాది ఎకరాలకు 5 బస్తాలు కూడా దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. సుమారు 500 హెక్టార్లలో పంట కన్ను మూసుకుపోయిందని రైతులు అంటున్నారు. దీంతో రైతుల ఆశలు అడియాశలైయ్యాయి.

**10 ఎకరాల్లో సజ్జ సాగుచేశా**



ఈ ఏడాది 10 ఎకరాల్లో సజ్జ సాగుచేశా. గత ఏడాది కంది సాగుచేస్తే పూర్తిగా దెబ్బతినింది. దీంతో ఈ ఏడాది ఈ ఏడాది సజ్జ పంట సాగుచేశారు. వర్షం కారణంగా సజ్జపంట కన్నుమూసుకుపోయింది. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అనుకున్న స్థాయిలో దిగుబడి రాదు.
– పల్లకి బసిరెడ్డి

**పెరిగిన పెట్టుబడి**



10 ఎకరాల్లో సజ్జ సాగుచేశా. గత ఏడాడి 5 ఎకరాల్లో 100 బస్తాలు పండించా. ఈ ఏడాది 10 ఎకరాలకు కూడా 50 బస్తాలు అయ్యేటట్లు లేవు. పెట్టుబడి ఎకరాకు రూ. 19 వేలు ఖర్చయింది. పాలకంకి దశలో పంటకు పచ్చపురుగు ఆశించింది. పంట దెబ్బతిని దిగుబడి తగ్గిపోయింది.
– దేవరపల్లి కృష్ణారెడ్డి

## వైఎస్ జగన్‌ను కలిసిన దద్దాల కుటుంబం


వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ గురువారం కుటుంబసమేతంగా తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## పౌష్టికాహారంపై అవగాహన అవసరం


పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుశీలాదేవి

పొన్నలూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సీడీపీఓ సుశీలా దేవి అన్నారు. పొన్నలూరులో గురువారం మండల స్థాయి పోషన్ పక్వాడ్, పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించి పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల్లో నిర్వహించిన సమావేశంలో సీడీపీఓ సుశీలాదేవి మాట్లాడుతూ రక్తహీనత లోపం వలన మాతృమరణాలు, శిశు మరణాలు, బరువు తక్కువ కలిగిన పిల్లలు పుడతారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారం అందించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నెలాఖరు వరకు పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్ విక్టోరియా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్లబర్లీ పొగాకు సాగు నిషేధం


సూరారెడ్డిపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ యుగంధర్‌రెడ్డి

టంగుటూరు: నల్ల బర్లీ పొగాకు సాగును నిషేధించినట్లు వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి తెలిపారు. నల్లబర్లీ పొగాకు నిషేధంపై మండలంలోని సూరారెడ్డిపాలెం గ్రామంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించేందుకు మండలస్థాయిలో టాస్క్‌ఫోర్సు టీంను ఏర్పాటు చేశారన్నారు. ఈ టీంకు తహసీల్దార్ చైర్మన్‌గా, వ్యవసాయాధికారి కన్వీనర్‌గా, సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పోలీస్, మెడికల్ ఆఫీసర్లు మెంబర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా నల్లబర్లీ పొగాకు నర్సరీలు పెంచినా, లేక సాగు చేసినా సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు కూడా పొగాకు సాగు తగ్గించుకొని ప్రత్యామ్నాయ పంటల సాగు చేసుకోవాలని సూచించారు.

## 13వ రౌండ్ పొగాకు వేలం ప్రారంభం


కొండపిలో రైతులతో మాట్లాడుతున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్


టంగుటూరులో పొగాకు వేలం

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం 13వ రౌండ్ పొగాకు వేలం ప్రారంభమైందని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ మార్కెట్‌ను పరిశీలించి రైతులు బేళ్లను తీసుకురావాలని సూచించారు. శుక్రవారం నిర్వహించిన వేలంలో 364 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. య్యవారిపాలెం, జువ్విగుంట, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాల రైతులు 1219 బేళ్లను తీసుకురాగా 855 బేళ్లను కొనుగోలు చేసి 364 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.340, కనిష్ట ధర రూ.90, సరాసరి ధర రూ.225.74గా నమోదైంది. వేలంలో 19 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు వేలం కేంద్రానికి నాణ్యమైన బేళ్ల తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాల రైతులు 1110 బేళ్లను తీసుకురాగా 835 బేళ్లను కొనుగోలు చేసి 275 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.340, కనిష్ట ధర రూ.100, సరాసరి ధర రూ.256.39 పలికింది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పొన్నలూరులో క్లాప్ మిత్రలకు మందులు అందజేస్తున్న ఎంపీడీఓ సుజాత


పెదఅలవలపాడులో పరిసరాలను శుభ్రపరుస్తున్న ఎంపీడీఓ


కె.ఉప్పలపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న రామాంజనేయులు


టంగుటూరు టోల్ ప్లాజాలో స్వచ్ఛత హీ సేవ

పొన్నలూరు: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, పరిశుభ్రమైన పల్లెల కోసం అందరూ కృషి చేయాలని ఎంపీడీఓ డాక్టర్ సుజాత అన్నారు. పొన్నలూరులో గురువారం స్వచ్ఛతాహీ సేవా–2025 కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులను అమె పరిశీలించి క్లాప్‌మిత్రలతో కలిసి వీధుల్లోని చెత్తను శుభ్రం చేశారు. అనంతరం క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కార్యదర్శి నారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని కె.ఉప్పలపాడులో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ఎంపీడీఓ రామాంజనేయులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ దయామని, ఎంపీటీసీ విజయలక్ష్మి, సెక్రటరీ పుష్పలత, రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

పీసీపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని పెద అలవపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

హనుమంతునిపాడు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు అన్నారు. మండలంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. తొలుత కార్యాలయం ముందు రోడ్డు ఊడ్చి శుభ్రం చేశారు.

టంగుటూరు: స్వచ్ఛతహీ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా రైజ్ కాలేజీ విద్యార్థులు, నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ ఆధ్వర్యంలో వల్లూరులో కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు


మోటారుసైకిల్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రమాదవశాత్తు మోటారుసైకిల్ అదుపుతప్పడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున మండల పరిధిలోని కె.బిట్రగుంట ఫ్లెట్లోవర్‌పై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సింగరాయకొండ మండలం కలికవాయ గ్రామానికి చెందిన ఇనకొల్లు మల్లికార్జున, కామేపల్లి రవికుమార్‌లు సినిమాకు వెళ్లి ఒంగోలు నుంచి కలికవాయకు తిరిగి వస్తుండగా కె.బిట్రగుంట ఫ్లైఓవర్ వద్దకు రాగానే అదుపుతప్పి కిందపడ్డారు.

వెనుకాల కూర్చున్న మల్లికార్జున తలకు తీవ్ర గాయాలు కాగా అపస్మార స్థితిలోకి వెళ్లాడు. రవికుమార్ తల, చేతికి గాయాలయ్యాయి. అంబులెన్సులో ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకించాలి

పామూరు:

అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం సాయంత్రం అమెరికా ఆదిపత్యం వ్యతిరేకించాలి అనే నినాదంతో రూపొందించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం వివిధ దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ తీరుపై ఈనెల 30వ తేదీవరకు ప్రజలను చైతన్యవంతులు చేయనున్నట్లు తెలిపారు.

## గాలికుంటు టీకాలు విధిగా వేయించాలి


సి.నాగులవరంలో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ రవి

సీఎస్‌పురం(పామూరు): పశుపోషకులు విధిగా తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని పశు సంవర్ధకశాఖ జేడీ బి.రవి అన్నారు. మండలంలోని సి.నాగులవరంలో గురువారం నిర్వహిస్తున్న గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా జేడీ బి.రవి గాలికుంటు టీకాల ఆవశ్యకతను రైతులకు వివరించారు. పాడిరైతులకు వాటిపోషణపై సలహాలు సూచనలు చేశారు. టీకాల కార్యక్రమం ఎలా జరుగుతోంది, సిబ్బంది పనితీరుపై పశుపోషకులను అడిగి తెలుసుకున్నారు. సీఎస్‌పురం ఏడీ ఆర్.రమేష్, మండల పశువైద్యాధికారి డాక్టర్ షేక్.మునీర్, వెటర్నరీ అసిస్టెంట్లు రమణయ్య, హరి, వినీత, నాగరాజు, హస్తి అంజయ్య, మురార్జి పశుపోషకులు పాల్గొన్నారు.

మర్రిపూడి: పశుపోషకులు గాలికుంటు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు బి.రవి అన్నారు. మండలంలోని కెల్లంపల్లిలో జరుగుతున్న గాలికుంటు వ్యాధి టీకాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు కార్యక్రమంనిర్వహిస్తామన్నారు. ఆయన వెంట సహాయ సంచాలకుడు పి.వేణు, కాకర్ల పశువైద్యాధికారి పేరయ్య ఉన్నారు.

# కాత్యాయనిదేవి పాహిమాం


అన్నపూర్ణాదేవి అలంకరణలో కామేపల్లి పోలేరమ్మ తల్లి


పీసీపల్లి: అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు


వల్లూరులో కాత్యాయనిదేవిగా వల్లూరమ్మ తల్లి


భైరవకోనలో గాయత్రీదేవి అలంకరణలో త్రిముఖదుర్గాదేవి


పామూరులో వాసవీమాత


నందనమారెళ్ల రాజరాజేశ్వరిదేవిగా

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లి పోలేరమ్మతల్లి ఆలయంలో అమ్మవారు గురువారం కాత్యాయని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన వల్లూరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు నాల్గవ రోజు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు.

సీఎస్‌పురం(పామూరు): దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా నాల్గవరోజు గురువారం భైరవకోనలోని శ్రీత్రిముఖ దుర్గాదేవి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సీఎస్‌పురంలోని రాచూరి పెద్దమ్మ అమ్మవారు కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు. భైరవకోనలో చండీహోమం, సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు.

పీసీపల్లి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహారుద్రపీఠంలో మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పామూరు: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా పామూరు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు తులసీనాథ్, రాఘవ సుమంత్‌శర్మ వేదమంత్రాల నడుమ వాసవీమాత మూలవిగ్రహమూర్తికి, ఉత్సవమూర్తికి విశేష పూజలు నిర్వహించారు.

పొన్నలూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మండలంలోని నాగిరెడ్డిపాలెం పోలేరమ్మతల్లి అమ్మవారు గురువారం కాత్యాయనీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించుకోని మొక్కులు తీర్చుకున్నారు.

కొండపి: మండలంలో అన్ని దేవాలయాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాల్గవ రోజు నేతివారిపాలెంలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో అమ్మవారు కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కనిగిరిరూరల్: దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నాల్గవ రోజు అమ్మవారు వివిధ అలంకరణలో దర్శభమిచ్చారు. వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సరస్వతీ దేవి అలంకరణలో దర్శభమిచ్చారు. శివనగర్ కాలనీలోని దత్త పీఠం నుండు జగత్ జననీ శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నందనమారెళ్ల బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరి మాత అలంకరణలో దర్శనమిచ్చారు.ఆలయంలో చండి, రుద్ర హోమాలు జరిగాయి.

కొండపి: మండలంలోని కె.ఉప్పలపాడు లో ఘనంగా దసరా నవరాత్రులు నిర్వహిస్తున్నారు. స్థానిక శివాలయంలో అమ్మవారు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.